AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

8-6-2026 (Monday) MAIN EDITION

## విమానాలను ఢీకొన్న గ్రౌండ్ సపోర్టు పరికరాలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఢిల్లీలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండ్ సపోర్ట్ పరికరాలు విమానాలను ఢీకొన్నాయి. దీంతో మూడు విమానాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం తర్వాత ఆ మూడు విమానాలను సేవలకు దూరంగా ఉంచినట్లు విమానాశ్రయ నిర్వాహకులు తెలిపారు.

## గీజర్‌లో గంజాయి రవాణా..



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయి పట్టుకున్నారు. ఇతర దేశాల నుంచి గంజాయి తీసుకు వస్తున్నట్లు పక్కా సమాచారం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కౌలాలంపూర్ నుంచి డీ7182 విమానంలో వచ్చిన ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేశారు. వారు తీసుకొచ్చిన గీజర్లలో హైడ్రోపోనిక్ గంజాయి ఉన్నట్లు గుర్తించారు. రూ.5.38 కోట్లు విలువ చేసే 15.38 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## ‘ఫీజుల నియంత్రణ చట్టం’ తేవాలి



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిన విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. విద్యా రంగాన్ని నాశనం చేసే ప్రయత్నాలను కాంగ్రెస్ సర్కార్ ఇకనైనా వీడాలని హితవు పలికారు. గురుకుల పాఠశాలల దుస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వాటిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## తక్షణమే ఇరాన్‌ను విడిచి వెళ్లండి..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితులు అస్సలు బాలేవని, భారత పౌరులు ఎవరూ కూడా ఇరాన్‌కు ప్రయాణాలు పెట్టుకోవద్దని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పవన్‌పై కమెడియన్ ప్రశ్నల వర్షం



**అక్షరటుడే, సినిమా డెస్క్ :** టాలీవుడ్ ప్రముఖ నటుడు రాహుల్ రామకృష్ణ తాజాగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ‘ఎక్స్’ ఖాతాలో వరుస ప్రశ్నలు కురిపించారు. పవన్ బాధ్యతలు నిర్వహిస్తున్న శాఖల పనితీరు, పారదర్శకతను ప్రస్తావిస్తూ ఆయన చేసిన ట్వీట్లు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## సింగరేణిపై కేటీఆర్‌కు కిషన్‌రెడ్డి కౌంటర్




**అక్షరటుడే, హైదరాబాద్ :** సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ.. గతంలో బీఆర్ఎస్ గానీ, ఇప్పుడు కాంగ్రెస్ గానీ ఏ విషయంలోనూ కేంద్రాన్ని సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కుమ్మక్కు అయ్యానంటూ తనపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ ప్లేయర్ మెస్సీ వస్తే కూడా సింగరేణి నిధులు ఖర్చు చేశారని, ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు కూడా సింగరేణి డబ్బులు పెడుతున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ ఎఫ్ఎన్‌సీసీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం అంటే అవినీతి, స్కామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కోల్ సెక్టార్‌లో అనేక మార్పులు తెచ్చినట్లు తెలిపారు.

## ఇంటర్వ్యూ మధ్యలో నుంచి వెళ్లిపోయిన ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియాపై తన అసహనాన్ని ప్రదర్శించారు. ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ 'ఎన్‌బీసీ' ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. యాంకర్ అడిగిన ప్రశ్నలకు తీవ్రంగా స్పందిస్తూ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ ట్రంప్ పాత వాదనను మళ్లీ తెరపైకి తెచ్చారు. అయితే, ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనడానికి ఎలాంటి ఆధారాలు లేవని యాంకర్ క్రిస్టెన్ గుర్తుచేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ట్రంప్ లైవ్‌లోనే యాంకర్‌పై విరుచుకుపడ్డారు. "నువ్వొక థర్డ్ రేట్ రిపోర్టర్.. నీకు ఇంటర్వ్యూ చేయడం కూడా రాదు" అంటూ మధ్యలో నుంచి వెళ్లిపోయారు.

## చండీగఢ్ టెస్ట్‌లో భారత్ ఘన విజయం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** చండీగఢ్ టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌తో పాటు బౌలర్లు విజృంభించారు. తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (100), శుబ్‌మన్ గిల్ (126) సెంచరీలతో చెలరేగారు. సాయి సుదర్శన్ 81, రిషబ్ పంత్ 81 పరుగులు చేశారు. భారత్ 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం భారత బౌలర్లు సత్తా చాటడంతో అఫ్గాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయ్యారు. అనంతరం ఫాలో ఆన్ ఆడిన అఫ్గాన్ జట్టు రెండో ఇనింగ్స్‌లో 112 పరుగులకు కుప్ప కూలింది. దీంతో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో విజయం సాధించింది.



# చల్లని కబురు

- తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్
- తొలకరి పలకరింపుతో అన్నదాతల హర్షం

> “ అన్నదాతలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకాయి. కొంతకాలంగా ఎండలు మండుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. అక్కడక్కడ అకాల వర్షా లు కురిసిన ఎండలు తగ్గకపోవడంతో ఉపశమనం లభించలేదు. దీంతో ప్రజలు తొలకరి పలకరింపు కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో నైరుతి రాకతో రాష్ట్రంలో తొలకరి జల్లులు కరిశాయి. వాతావరణం చల్లబడింది. ”

తెలంగాణను నైరుతి రుతుపవనాలు సోమవారం తాకాయి. గద్వాల జిల్లాలోకి ప్రవేశించాయి. రెండు, మూడు రోజుల్లో రాష్ట్రం అంతటా రుతుపవనాలు విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందన్నారు. కాగా.. ఉదయం నుంచే పలు జిల్లాలో భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే పూర్తిగా విస్తరించిన రుతుపవనాలు.. ఏపీ, మహారాష్ట్రలో 30శాతం విస్తరించాయి. మరోవైపు బంగాళాఖాతంలో పూర్తిగా వ్యాపించినట్లు అధికారులు పేర్కొన్నారు.

### ఎల్‌నినో ప్రభావం

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే వర్షపాతం కొంత తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలోని పలు జిల్లాలో లోటు వర్షపాతం నమోదు అవుతుందని పేర్కొంది. మధ్య తెలంగాణలో సాధారణ వర్షాలు కురుస్తాయని, ఉత్తర, దక్షిణ తెలంగాణలో తక్కువ పడుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు సాగు ప్రణాళికలు రూపొంచించుకోవాలని అధికారులు సూచించారు.

### సాగు పనుల్లో బిజీ

నైరుతి ఆగమనంతో అన్నదాతలు సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దుక్కులు దున్నారు. కొంతమంది తుకాలు కూడా పోశారు. తొలకరి పలకరింపుతో తాజాగా వ్యవసాయ పనులు జోరందుకోనున్నాయి. ఇప్పటికే అన్నదాతలు ఎరువులు, విత్తనాల కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలు నిత్యం కళకళలాడుతున్నాయి.



## తెలంగాణ జాతిని అంతం చేసే యత్నం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ హిట్లర్ సీఎం రేవంత్ రెడ్డి అని ప్రజలకు ముందే తెలుసన్నారు. రేవంత్‌రెడ్డి ఇటీవల మాట్లాడుతూ.. తాను హిట్లర్ స్ఫూర్తితో హైడ్రా ఏర్పాటు చేశానని తెలిపారు. హైడ్రా హిట్లర్‌కు ఇష్టమైన పదం అన్నారు. దీనిపై తాజాగా జీవన్‌రెడ్డి స్పందించారు. ఆ హిట్లర్ యూధుల జాతిని అంతం చేస్తే.. ఈ హిట్లర్ రేవంత్‌రెడ్డి తెలంగాణ జాతిని అంతం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. లగచర్లలో భూమి కోసం పోరాడిన గిరిజనులకు బేడీలు వేసినప్పుడే సీఎం రేవంత్‌రెడ్డి హిట్లర్ అని తెలుసన్నారు.



## మళ్లీ మొదలైన యుద్ధం

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధం మొదలైంది. మిస్సైళ్లతో ఇరాన్, ఇజ్రాయిల్ పరస్పర దాడులు చేసుకున్నాయి. దీంతో కొన్ని రోజులుగా ప్రశాంతంగా ఉన్న పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ మొదట క్షిపణులతో దాడులు చేసింది. అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత తొలిసారి ఇరాన్ ఇజ్రాయిల్‌పై దాడులు చేపట్టింది. దీంతో ఇజ్రాయిల్ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు ప్రారంభించింది. దీంతో రెండు దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. టెహ్రాన్‌లో రెండు శక్తివంతమైన పేలుళ్లు వినిపించాయని, ఇస్ఫహాన్, కరాజ్, తబ్రిజ్ నగరాల్లో కనీసం మూడు పేలుళ్లు వినిపించాయని అధికారులు తెలిపారు. నెవాటిమ్, టెల్ నోఫ్‌లోని ఇజ్రాయిల్ వైమానిక స్థావరాలపై దాడులు ఇరాన్ ఐఆర్‌జీసీ పేర్కొంది.

## హెచ్‌సీఏ అధ్యక్షుడి ఎన్నిక రద్దు..





**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమర్‌నాథ్ ఎన్నికను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. అసోసియేషన్ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు వీలుగా.. వెంటనే ప్రత్యేక ఏజీఎం సమావేశాన్ని ఏర్పాటు చేసి, కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## ఫ్యూచర్ సిటీకి చట్టపరమైన రక్షణ..



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలను ఆహ్వానిస్తోంది. అయితే తాము అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇలాంటి వ్యాఖ్యలతో అక్కడ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు ఆలోచిస్తాయి. దీంతో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీకి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు సిద్ధమైంది. భవిష్యత్‌లో దానిని రద్దు చేయకుండా గ్రీన్ ఫార్మా సిటీ డెఫినిషన్‌ను ‘అర్బన్‌నేటివ్ అండ్ హ్యూమన్ పబ్లిక్ పర్పస్’గా మారుస్తూ భూసేకరణ చట్టం సెక్షన్ 2 ప్రకారం నిబంధనల సవరణకు కసరత్తు చేస్తోంది.




## ఫిలిప్పీన్స్‌ను కుదిపేసిన వరుస భూకంపాలు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. అంతర్జాతీయ భూగర్భ పరిశోధనా సంస్థల తాజా నివేదికల ప్రకారం.. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఆ వెంటనే 6.1, 6.0 తీవ్రతతో మరో రెండు భూకంపాలు సంభవించాయి. ఈ భారీ భూకంపాల కారణంగా పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంత దేశాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. రాబోయే కొన్ని గంటల్లో తీరప్రాంతాలకు సునామీ ముప్పు పొంచి ఉందని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం (పీటీడబ్ల్యూసీ) హెచ్చరికలు జారీ చేసింది. ఫిలిప్పీన్స్‌లోని మిండనావో ద్వీపకల్పానికి సమీపంలో సెలెబెస్ సముద్రం అంతర్భాగంలో ఈ భూకంప కేంద్రం కేంద్రీకృతమైంది. ఈ భూకంపాల తీవ్రత దృష్ట్యా ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, తైవాన్, మలేషియా, పలావు, పపువా న్యూగినియా దేశాల తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. సముద్ర తీరంలో అలలు భారీగా ఎగసిపడ్డాయి.